క్లుప్తంగా

రేపటి నుంచి భోగ శ్రీనివాసుని విగ్రహానికి సంప్రోక్షణ

విజయవాడ కల్చరల్: రేపటి నుంచి 25వ తేదీ వరకు పున్నమ్మతోటలోని టీటీడీ దేవాలయంలో భోగ శ్రీనివాసునకు మహాసంప్రోక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ లలితా రమాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 22న సాయంత్రం, భగవత్ ప్రార్థన, అంకురార్పణ వేదారంభం, 23న ఉదయం 8 గంటల నుంచి పుణ్యాహవాచనం, ప్రాయశ్చిత హోమం కుంభసాధన, 24న ఆదివారం పంచగవ్యాది వాసం, మహాశాంతి అభిషేకం, 25న మహాపూర్ణాహుతి తదితర కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.

నలుగురు ఏసీపీలకు పోస్టింగ్

విజయవాడస్పోర్ట్స్: డీఎస్పీల సాధారణ బదిలీల్లో భాగంగా ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌కు నలుగురు ఏసీపీలను కేటాయిస్తూ డీజీపీ ద్వారకాతిరుమలరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తాజా ఉత్తర్వుల ప్రకారం క్రైం ఏసీపీగా సి.హెచ్.వెంకటేశ్వర్లు, సీటీసీ ఏసీపీగా బి.ఉమామహేశ్వరరెడ్డి, మహిళా పోలీస్ స్టేషన్ ఏసీపీగా కె.లతాకుమారి, సీఎస్‌బీ ఏసీపీగా ఎస్.కిరణ్‌కుమార్‌ను నియమించారు. వెయిటింగ్‌లో ఉన్న ఈ నలుగురికి పోస్టింగ్ ఇస్తున్నట్లు డీజీపీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేటి నుంచి ఎఫ్‌సీఐ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ

విజయవాడస్పోర్ట్స్: భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ) ఉద్యోగుల రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఈ నెల 21, 22 తేదీల్లో విజయవాడ శివారు నున్నలోని గ్రీన్ ఫీల్డ్ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్నట్లు ఎఫ్‌సీఐ ఏపీ రీజనల్ ఆఫీస్ జనరల్ మేనేజర్ విజయ్‌కుమార్‌యాదవ్ తెలిపారు. శ్రీకాకుళం, విశాఖపట్నం, కాకినాడ, తాడేపల్లిగూడెం, విజయవాడ, నెల్లూరు, కర్నూలు డివిజనల్ కార్యాలయాల జట్లు ఈ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తాయన్నారు. పోటీల్లో విజేత జట్లకు ట్రోఫీలను అందజేస్తామన్నారు.

ప్రభుత్వ మద్యం దుకాణాల్లోని వస్తువులకు 25న వేలం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీఎస్‌బీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ మద్యం షాపులకు సంబంధించిన వస్తువులకు ఈనెల 25వ తేదీ ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు గొల్లపూడి డిపో ఇన్‌చార్జి మేనేజర్ ఆర్.దుర్గాప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ మద్యం దుకాణాలకు సంబంధించిన 80 ఫ్రీజర్స్, 84 బ్యాటరీ ఇన్వర్టర్స్, 93 క్యాష్ చెస్ట్, 335 స్కానర్లు, 92 క్యాష్ కౌంటింగ్ మెషీన్లకు వేలం జరుగుతుందన్నారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఆధ్వర్యంలో గొల్లపూడి డిపోలో వేలం నిర్వహిస్తామన్నారు. ఇతర వివరాలకు 94411 93915 నంబరులో సంప్రదించాలని కోరారు.

పోలీసుల వైఖరి హేయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): సీనియర్ న్యాయవాది పూనూరు గౌతంరెడ్డిపట్ల పోలీసులు వ్యవహరిస్తున్న తీరును బెజవాడ బార్ అసోసియేషన్ (బీబీఏ) న్యాయవాదులు తీవ్రంగా ఖండించారు. సెర్చ్ వారెంట్ లేకుండా గౌతమ్‌రెడ్డి ఇంట్లోకి పోలీసులు చొరబడి ఆయన కుటుంబసభ్యులతో అనుచితంగా ప్రవర్తించడాన్ని నిరసిస్తూ బుధవారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. విజయవాడలో పోలీసుల వ్యవహారశైలి విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు.

23న యువ సంగీత సమ్మేళనం

విజయవాడ కల్చరల్: శ్రీ సుబ్రహ్మణ్య సంగీత సమితి ఆధ్వర్యంలో ఈ నెల 23న దుర్గాపురంలోని సంస్థ కార్యాలయంలో యువ సంగీత సమ్మేళన కార్యక్రమం నిర్వహిస్తునట్లు సంస్థ కార్యదర్శి సీవీ రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి సోదరులు తుమ్మలూరి సంపత్ కుమార్, సంకీర్త్ కుమార్ వయోలిన్, చివుకుల నాగ సాయి శిరీష గాత్ర సంగీతం నిర్వహిస్తునట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గాంధీనగర్ విద్యుత్ ఉపకేంద్రం 11 కేవీ అన్నపూర్ణ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం గురువారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. అలీ బేగ్ వీధి, డీటీ రావు వీధి, ప్రకాశం రోడ్డు, ఎన్టీఆర్ కాంప్లెక్స్, గోపాల్ రెడ్డి రోడ్డు, అట్లూరత్తయ్య వీధి, ఏలూరు రోడ్డు, సీఆర్‌డీఏ ఆఫీస్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు సెక్షన్ నల్ల గేటు ఫీడర్ పరిధిలో విద్యుత్ వైర్లు మరమ్మతుల దృష్ట్యా గురువారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి. రవీంద్రబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడింకి వారి స్ట్రీట్, రామాలయం వీధి, గడియారం వారి వీధి ,అబ్బూరు వారి వీధి, వ్యాకరణం వారి వీధి, ముదిగొండ వారి వీధి, తిరుమల శెట్టి వారి వీధి తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని పలువురు వక్తలు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రంథాలయాలకు అలవాటు చేయాలని, వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని కోరారు. ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం గ్రంథాలయంలో ముగింపు ఉత్సవాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఫ్లోర్‌లీడర్ నెలిబండ్ల బాలస్వామి, రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జీవీ పూర్ణచంద్, కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వేములపల్లి రవికుమార్ పాల్గొని గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. పోటీల్లో భాగంగా విచిత్ర వేషధారణలో శ్రీ బస్వా అప్పలస్వామి నగర పాలక ప్రాథమిక పాఠశాలకు చెందిన నాల్గో తరగతి విద్యార్థిని ఏలూరి వరలక్ష్మి విశేష ప్రతిభ కనబర్చింది. నిర్వాహకుల నుంచి బహుమతి అందుకుంది. విజయవాడ ఆర్ట్స్ సొసైటీ అధ్యక్షుడు కొలుసు సుబ్రహ్మణ్యం, గ్రంథాలయాధికారి కె.రమాదేవి విజేతలకు అభినందనలు తెలిపారు.

రామమోహన గ్రంథాలయంలో...

రామ్మోహన గ్రంథాలయంలో విశిష్ట పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల విద్యార్థులు సందర్శించారు. మహిళా కళాశాల గ్రంథాలయ అధికారి మల్లిక ఆధ్వర్యంలో 60 మంది విద్యార్థులు ప్రదర్శనను వీక్షించారు. ప్రత్యేక పుస్తకాల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు చింతలపూడి కోటేశ్వరరావు కార్యదర్శి వేములపల్లి కేశవ రావు మాట్లాడుతూ గ్రంథాలయం ద్వారా విద్యార్థులు, పాఠకులకు అందిస్తున్న సేవలను వివరించారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీ అల్లూరి సీతారామరాజు స్మారక గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. రామాయణం, మహాభారతం, భాగవతం రచించిన కవులు తెలుగు రచయితల ఫొటోలను మాజీ డెప్యూటీ మేయర్ సామంతపూడి నరసరాజు సాంస్కృతిక సంఘం అధ్యక్షులు ఎస్ వెంకటేశ్వరరాజు, ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్‌వీ సుబ్బరాజు, కోశాధికారి డీజేపీఎస్ రాజులతో కలిసి ఆవిష్కరించారు. డిగ్రీ విద్యార్థులు ముగ్గురికి ఒక్కొక్కరికి రూ. 10 వేలు చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. గ్రంథాలయ కార్యదర్శి పీవీ సుబ్బరాజు, కార్యవర్గ సభ్యులు పి.రాంబాబు, కేఎస్ ప్రసాదరాజు, చిరంజీవి, హరిబాబు, అచ్యుత రామరాజు తదితరులు పాల్గొన్నారు. రామకృష్ణాపురం జిల్లా గ్రంథాలయ సంస్థ శాఖా గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఎంకే బేగ్ నగర పాలక సంస్థ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, వాటిని సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని స్థానిక 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణిమూర్తి పేర్కొన్నారు. సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు జరిగాయి. చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్ , దేశభక్తి గీతాలు, జానపద గీతాలు, నృత్య పోటీలు, ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కార్పొరేటర్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): పుస్తక పఠనంతో విద్యార్థుల మేధస్సు పెరుగుతుందని ఎస్ఆర్ఆర్ అండ్‌సీవీఆర్ ప్రభుత్వడిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి తెలిపారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్‌సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం సాయంత్రం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో గ్రంథాలయాల పాత్ర ఎనలేనిదని తెలిపారు. పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల లైబ్రేరియన్ టి.ప్రశాంత్ విద్యాసాగర్, అధ్యాపకులు డాక్టర్ యూవీ రమణమూర్తి, డాక్టర్ డీవీవీఎస్ బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొని మాట్లాడారు.



ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో సర్టిఫికెట్లతో విద్యార్థులు



అల్లూరి సీతారామరాజు స్మారక గ్రంథాలయంలో కవులు, రచయితల ఫొటోలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

మాదక ద్రవ్యాలు ఎంతో ప్రమాదకరం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మాదక ద్రవ్యాలకు అలవాటు పడడం వల్ల ఆరోగ్యం పూర్తిగా దెబ్బతిని, జీవితం అంధకారంగా మారుతుందని... ప్రమాదకరమైన మాదక ద్రవ్యాలకు విద్యార్థులు చాలా దూరంగా ఉండాలని నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్ జాకబ్‌రాజు విద్యార్థులను హెచ్చరించారు. బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో సింగ్‌నగర్ ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్‌లో 'మాదకద్రవ్యాలు – ఆరోగ్యంపై ప్రభావం' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల హెచ్‌ఎం పరసా వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో గవర్నర్‌పేటలోని సీవీఆర్ మున్సిపల్ హైస్కూల్లో విద్యార్థులకు బాలలపై సోషల్ మీడియా ప్రభావం అనే అంశంపై చిత్రలేఖనం, కళాశాల విద్యార్థులకు 'మాదకద్రవ్యాలు – ఆరోగ్యంపై ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన గవర్నరుపేట పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఫ్రాన్సిస్ మాట్లాడుతూ డ్రగ్స్ వలన కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.



పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఇన్‌స్పెక్టర్ ఫ్రాన్సిస్

గ్రంథాలయాల సంఖ్య పెంచాలి

విజయవాడ కల్చరల్: రాష్ట్రంలో ప్రజల నిష్పత్తి ఆధారంగా గ్రంథాలయాల సంఖ్య బాగా పెరగాలని జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి వ్యవస్థాపకుడు గోళ్ళ నారాయణరావు అన్నారు. జాతీయ గ్రంథాలయాల వారోత్సవాల సందర్భంగా విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో బుధవారం గ్రంథాలయాలు –సమాజం అంశంగా సదస్సు నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన గోళ్ళ నారాయణరావు మాట్లాడుతూ రాష్ట్రంలో నడుస్తున్న గ్రంథాలయాలకు విద్యార్థులను రప్పించాల్సిన అవసరం ఉందన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సత్యశ్రీనివాస్, బుక్ ఫెస్టివల్ సొసైటీ సభ్యురాలు లక్ష్మి మాట్లాడుతూ గ్రంథాలయాలకు పూర్వవైభవం తీసుకురావాలని సూచించారు. ప్రజాశక్తి బుక్ హౌస్ ప్రతినిధి లక్ష్మయ్య స్వాగతం పలికారు. ప్రచురణ కర్తలు పల్లవి వెంకట నారాయణ, జేపీ పబ్లికేషన్స్ ప్రసాద్, సాహిత్యరంగానికి చెందిన దివికుమార్, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, పేరిశెట్టి శ్రీనివాస్, సుంకర నాగభూణం పాల్గొన్నారు.

దేవాలయాల నిర్వహణ హిందువులకే అప్పగించండి

విశ్వ హిందూ పరిషత్ కేంద్రీయ ప్రధాన కార్యదర్శి కోటేశ్వర శర్మ

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): దేశ వ్యాప్తంగా ప్రభుత్వ నియంత్రణలో ఉన్న హిందూ దేవాలయాల నిర్వాహణను హిందూ సమాజంతో ఒక నూతన వ్యవస్థను ఏర్పాటు చేసి దానికి అప్పగించాలని విశ్వ హిందూ పరిషత్ కేంద్రీయ ప్రధాన కార్యదర్శి కె.కోటేశ్వర శర్మ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం సత్యనారాయణపురంలోని విశ్వ హిందూ పరిషత్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తిని కల్పిస్తూ చట్ట సవరణ చేసే దిశగా జనవరి 5న విజయవాడలో నిర్వహించనున్న 'హైందవ శంఖారావం' బహిరంగ సభలో పెద్ద సంఖ్యలో హిందువులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ వేదికలో దేశంలోని ప్రముఖ ధర్మాచార్యులతో పాటు విశ్వహిందూ పరిషత్ జాతీయ నాయకులు పాల్గొని మార్గదర్శం చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి తనికెళ్ల సత్య రవికుమార్ పాల్గొన్నారు.

కిడ్నీ మార్పిడి చికిత్స వికటించి రోగి మృతి

స్వర హాస్పిటల్‌పై మృతుని భార్య ఫిర్యాదు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సరైన చికిత్స అందించకుండా తన భర్త మృతికి కారణమైన స్వర హాస్పిటల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలంటూ మృతుని భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సత్యనారాయణపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పొన్నకంటి రమేష్, సారిక భార్యభర్తలు. వీరు ఇద్దరు పిల్లలతో కలసి కృష్ణా జిల్లా కానూరు గ్రామంలో నివాసముంటున్నారు. గత మే నెలలో రమేష్‌కు జ్వరం వచ్చి తగ్గకపోవడంతో బీఆర్‌టీఎస్ రోడ్డులోని స్వర హాస్పిటల్‌లో చేర్పించారు. పరీక్షల అనంతరం అతనికి కిడ్నీ సంబంధిత వ్యాధి ఉందని చెప్పగా గత మూడు నెలలుగా డయాలసిస్ చేయిస్తున్నారు. డయాలసిస్ కంటే కిడ్నీ మార్పిడి చేస్తే పూర్తి ఆరోగ్యంగా ఉంటారని చెప్పడంతో, రమేష్ తల్లి కిడ్నీ ఇవ్వడానికి ముందుకు వచ్చారు. వైద్యులు అన్ని పరీక్షలు నిర్వహించి ఆగస్టులో కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేశారు. ఇరవై రోజులు గడుస్తున్నా రమేష్ ఆరోగ్యంలో మార్పు రాకపోగా, మరిన్ని అనారోగ్య లక్షణాలు కన్పిస్తుండటంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. వైద్యులను ప్రశ్నిస్తే ఇక్కడ వైద్యం ఇంతే... మెరుగైన వైద్యం కావాలంటే వేరే ఆసుపత్రిలో చేర్పించుకోవాలంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. చేసేది లేక రమేష్‌ను నగరంలోని మరో ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడి డాక్టర్లు పరీక్షించి అతనికి మార్పిడి చేసిన కిడ్నీలో రక్తం గడ్డకట్టి, పూర్తిగా ఇన్‌ఫెక్షన్‌కు గురై, ఇతర అవయవాలకు కూడా ఇన్‌ఫెక్షన్ పాకిందని చెప్పారు. అక్కడ చికిత్స అందిస్తుండగా ఈ నెల 17న రమేష్ మృతి చెందాడు. తన భర్త మృతికి స్వర హాస్పిటల్ యాజమాన్యమే కారణమని, దానిపై చర్యలు తీసుకోవాల్సిందిగా సారిక ఎస్ఎన్‌పురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మూడేళ్ల కాల పరిమితితో ఇచ్చిన సర్క్యులర్ రద్దు చేయాలి

వీఓఏ యూనియన్ డిమాండ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వీఓఏలకు సంబంధించి మూడేళ్ల కాలపరిమితితో జారీ చేసిన సర్క్యులర్ రద్దు చేస్తామని చంద్రబాబు ఇచ్చిన హామీని అమలు చేయాలని వీఓఏ యూనియన్ డిమాండ్ చేసింది. వెలుగు వీఓఏ ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ వెలుగు యానిమేటర్స్ (వీఓఏ) ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నా నుద్దేశించి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎస్.కె చాంద్ బేగం, గౌరవ అధ్యక్షురాలు ఎ.కమల, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల ఉమాదేవి మాట్లాడుతూ సదరు సర్క్యులర్ రద్దు చేయాలని ఎన్నికల ముందు ఆందోళన చేస్తున్న సమయంలో టీడీపీ తరఫున వర్ల రామయ్య స్వయంగా హాజరై, తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే, సర్క్యులర్‌ని రద్దు చేస్తామని, చంద్రబాబు తన మాటగా చెప్పమన్నారని హామీ ఇచ్చారు. సర్క్యులర్‌ను రద్దు చేయకపోగా రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మూడేళ్లు పూర్తి చేసిన వీఓఏలను మార్చుకోవచ్చని ప్రకటనలు చేయడాన్ని యూనియన్ తప్పుబట్టింది. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎ. వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఎస్.సి. హెచ్ శ్రీనివాస్, వీఓఏ యూనియన్ నాయకులు పి.రోజా, వి.దేవి, కె.సుమలత తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పడిపూజ

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిరం సమీపంలో బుధవారం సాయంత్రం శ్రీ మకర జ్యోతి సేవా సమితి ఆధ్వర్యాన ఇప్పిలి శ్రీనివాస్ సహకారంతో పడి పూజ, భజన కార్యక్రమం నిర్వహించారు. అరటి దొప్పలతో అందంగా అలంకరించిన ప్రత్యేక మందిరంలో అయ్యప్ప స్వామివారిని ఉంచి బ్రహ్మశ్రీ మురళీధర్ నంబూద్రి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు, స్వాములు పడిపూజలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. దుర్గాపురం అయ్యప్ప స్వామి మందిరంలో బుధవారం అయ్యప్పకు శ్రీమణికంఠ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిగాయి. బల్లెం పూర్ణయ్య గురుస్వామి స్వామివారికి విశేషంగా పంచామృత అభిషేకం అర్చనలు నిర్వహించారు. మధురానగర్ పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో బుధవారం కార్తీక మాసోత్సవాలలో భాగంగా శ్రీ చంద్రశేఖర స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించారు. అనంతరం దాతల సహకారంతో స్వాములు, మాలధారులకు అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను మందిర వ్యవస్థాపకులు తంగెళ్ళమూడి వీర మోహనరావు పర్యవేక్షించారు.



ముత్యాలంపాడులో అయ్యప్ప పడి పూజ కార్యక్రమం

భక్తజన సంద్రం... ఆధ్యాత్మిక వైభవం

విజయవాడ కల్చరల్: శృంగేరీ పీఠ ఉత్తరాధికారి విధుశేఖర భారతి స్వామి నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న విజయయాత్ర బుధవారం ముగిసింది. స్వామి శివరామ కృష్ణ క్షేత్రంలో కొలువై వున్న బాల సుందరీ సమేత చంద్రమౌళీశ్వర స్వామికి, సీతారామాలయం, సంతాన వేణుగోపాల స్వామికి, మహాలక్ష్మి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామిలకు ప్రత్యేక పూజలు, శివాలయ శిఖరానికి కుంభాభిషేకం నిర్వహించారు. వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన వేద పండితులు వేద సభను నిర్వహించారు. ఆధ్యాత్మిక గ్రంథ విక్రయశాల భారతీ గ్రంథమండలిని స్వామి ప్రారంభించారు. అనంతరం స్వామి అనుగ్రహ భాషణచేస్తూ ధర్మబద్ధమైన జీవితం గడపాలని సూచించారు. ఆది శంకరులు స్థాపించిన శృంగేరీపీఠం వేద సంస్కృతికి కట్టుబడి ఉందని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకొన్నారు. విజయయాత్రలో భాగంగా స్వామి వారు నరసరావుపేట బయలు దేరారు. శివరామకృష్ణ క్షేత్ర ధర్మాధికారి శిష్టా హనుమత్ ప్రసాద్ దంపతులు స్వామి వారికి వీడ్కోలు పలికారు.

ప్రయోగాలతో వివరిస్తే ఉత్తమ ఫలితాలు

జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులకు సైన్స్ పరికరాలు, ప్రయోగాలతో పాఠ్యాంశాలను బోధిస్తే తేలికగా అర్థమవుతాయని జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్ అన్నారు. సింగ్‌నగర్ ఎంకే బేగ్ మునిసిపల్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన కాంప్లెక్స్ ఫిజికల్ సైన్స్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హుస్సేన్ మాట్లాడుతూ ఇటువంటి బోధనా పద్ధతులు అనుసరిస్తే విద్యార్థులకు మంచి మార్కులు రావడమే కాకుండా.. సబ్జెక్టుపై ఆసక్తి పెరిగి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసినట్లు అవుతుందని చెప్పారు. ఏ విద్యార్థిని కదిలించినా సైన్స్ సబ్జెక్ట్‌పై కాస్త భయంగా ఉన్నట్లు చెబుతారని, దానికి కారణం ఆ సబ్జెక్టును నేర్పించే విధానం వల్ల వారికి అర్థం కాకపోవడమేనన్నారు. అదే సైన్స్ పరికరాలతో రసాయన సమీకరణాలు, ఆమ్లాలు, క్షారాలు, కాంతిలో కాటకాలు రకాలు, కరెంట్ పాఠంలో అమ్మీటర్, ఓల్ట్ మీటర్, ఓహ్‌లా వంటి ప్రయోగాలతో సైన్స్ సబ్జెక్ట్ విద్యార్థులకు బోధించినట్లైతే వారికి తేలికగా అర్థమవుతుందన్నారు. ఒక మంచి సైన్స్ టీచర్ నేర్పే విధానంపైనే ఆ పాఠశాల విజయం ఎక్కువగా ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. సైన్స్ పరికరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి భద్రపరుచుకోవాలని సూచించారు. పాఠశాల హెచ్‌ఎం పరసా వెంకటేశ్వరరావు, సైన్స్ టీచర్లు ప్రభాకర్, సాయి, ప్రసాద్, రవి, రమణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో కలిసి సైన్స్ పరికరాలను పరిశీలిస్తున్న జిల్లా సైన్స్ అధికారి హుస్సేన్

ఐటీడీపీ అరాచకాలను నియంత్రించాలి

- బాధ్యులను శిక్షించాలి..
- పోలీసులకు ఫిర్యాదు చేసిన వైఎస్సార్‌సీపీ నేతలు

గుణదల(విజయవాడతూర్పు): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో కీచక పాలన మొదలైందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ ఆరోపించారు. ఐటీడీపీ మీడియా కార్యకర్తలపై వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఇన్‌చార్జి మల్లాది విష్ణుతో కలసి మాచవరం పోలీసులకు బుధవారం ఆయన ఫిర్యాదు చేశారు. మాచవరం ఎస్ఐ శంకరరావుకు ఫిర్యాదు ప్రతిని అందజేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ నేతలు ఐటీడీపీ మీడియాను అడ్డుపెట్టుకుని వైఎస్సార్ సీపీ నేతలపై దుష్ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులను అసభ్యకర పదజాలంతో దూషిస్తూ పోస్టులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం వైఎస్సార్ సీపీ నాయకులను టార్గెట్ చేస్తూ అక్రమ కేసులు బనాయిస్తున్నారని వివరించారు. టీడీపీ నేతలు చేస్తున్న అరాచకాలను నియంత్రించాలని పోలీసులకు విన్నవించామని తెలిపారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కార్యకర్తలకు అండగా ఉంటారని, బెదిరింపులకు భయపడేది లేదని తేల్చి చెప్పారు. ఇప్పటికైనా చిల్లర రాజకీయాలకు తెర దింపి ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని హితవు పలికారు. సోషల్ మీడియాను అడ్డు పెట్టుకుని కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న టీడీపీ నాయకులపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సెంట్రల్ మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు డిమాండ్ చేశారు. నగర డెప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శైలజారెడ్డి, ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ, కార్పొరేటర్లు కలపాల అంబేడ్కర్, వైఎస్సార్ సీపీ నాయకులు ఆసిఫ్, నవీన్, సుభాషిణి, చంద్రలీల తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న దేవినేని అవినాష్, మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్లు దుర్గ, శైలజారెడ్డి

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

సింగ్‌నగర్ రైతుబజార్‌లో వ్యాపారులకు డీఏటీఎం మంగమ్మ హెచ్చరిక

సాక్షి ఎఫెక్ట్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రైతుబజార్లలో ప్రభుత్వం నిర్ణయించిన ధరల కన్నా ఎక్కువ రేట్లకు కూరగాయలు విక్రయించడం నేరమని.. అలా జరిగినట్లు తేలితే రైతులైతే వారి కార్డులను, డ్వాక్రా గ్రూప్ సంఘాలు అయితే వారి ఆర్డర్‌లను రద్దు చేస్తామని జిల్లా వాణిజ్య వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారిణి కె.మంగమ్మ హెచ్చరించారు. సింగ్‌నగర్ రైతుబజార్‌లో అధిక ధరలకు కూరగాయల విక్రయించడం, నాణ్యమైన వాటికి బదులు.. నాసిరకం కూరగాయలు అమ్ముతున్న విషయాలను వివరిస్తూ సాక్షి పేపర్లో ఈ నెల 19వ తేదీన 'సింగ్‌నగర్ రైతు బజార్ రూటే సెపరేటు' అనే శీర్షికతో కథనం వెలువడింది. ఈ కథనానికి స్పందించిన జాయింట్ కలెక్టర్ సింగ్‌నగర్ రైతుబజార్‌లో పరిస్థితులపై విచారణ చేపట్టాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో జిల్లా వాణిజ్య వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారి కె.మంగమ్మ బుధవారం రైతుబజార్‌లో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. రైతు బజార్‌లో కూరగాయలు ఏ విధంగా ఉంటున్నాయో పరిశీలించి, ధరలు, నాణ్యతపై కొంతమంది వినియోగదారుల అభిప్రాయాలను సేకరించారు. నిర్దేశించిన ధరలకన్నా ఎక్కువ రేట్లకు కూరగాయలను విక్రయించినా.. వినియోగదారులపట్ల దురుసుగా ప్రవర్తించినట్లు తేలినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతుబజార్ ఈఓ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వినియోగదారులతో మాట్లాడుతున్న డీఏటీఎం కె.మంగమ్మ

మెగా డీఎస్సీ నుంచి మినహాయించాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వివిధ గిరిజన గురుకులాల్లో ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న తమకు న్యాయం చేయాలని అధ్యాపకులు ప్రభుత్వాన్ని వేడుకున్నారు. గిరిజన కులాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ టీచర్లను క్రమబద్ధీకరించాలని, ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీల్లో గురుకులాల్లో 1143 పోస్టులను మినహాయించాలని, రెగ్యులరైజ్ చేసేంతవరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ గిరిజన గురుకుల టీచర్ల యూనియన్ విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్‌లో ఆందోళన చేపట్టింది. ఈ ధర్నాలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు లక్ష్మీనాయక్, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్ నాయక్, నాయకులు ఎస్. పరమేష్, ఎమ్. విజయ్ కుమార్ నాయక్, జి. బ్రహ్మయ్య, ఎన్. రమణ, పీటర్ పాల్, డి. రామకృష్ణ, కళ్యాణ్ శ్రీనివాస్, ఎ. తార, యస్.కే.మహమ్మద్ పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ శ్రీనివాస డిస్టెన్స్ ఎడ్యుకేషన్ 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 Certified. APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్శిటీ ద్వారా BA, B.Com, B.Sc, M.Com, MBA, MCA ✆ 99493 08940

■ ఆంధ్రా, నాగార్జున యూనివర్శిటీల ద్వారా Degree, P.G, M.B.A, M.C.A, Authorised Study & Exam Center. డైరెక్ట్ 10th ఒకే సం॥లో ఇంటర్. భవ్య అకాడమీ (Since: 2001) ✆ 97053 35678

REAL ESTATE

FLAT FOR SALE

■ 3 BHK & 4 BHK Luxurious East & West Facing Flats (4272 Sq.Ft) with 2 Car Parking. 2 Flats per Floor. At Tadepalli. ✆ 92464 95388

PLOT FOR SALE

■ NH65 ఆనుకొని కొనతనపాడు గ్రామం, దావులూరు టోల్‌గేట్ సమీపంలో ప్లాట్స్ & కమర్షియల్‌కి ఉపయోగించే 1.1 ఎకరం అమ్మకానికి కలదు. ✆ 90597 85978, 86393 51354

SERVICES

■ హోమ్‌కేర్ సర్వీసెస్. పేషెంట్ వర్క్, బేబీకేర్, స్పోర్టింగ్, కుకింగ్ ఎవరికైనా కావాలి అంటే ఈ నెంబరుని సంప్రదించగలరు. ✆ 93984 81924

www.sakshi.com

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 88024 89999

WANTED

■ ప్రముఖ సెక్యూరిటీ సంస్థ నందు పనిచేయుటకు ఫీల్డ్ ఆఫీసర్స్, సెక్యూరిటీ గార్డ్స్ స్త్రీ మరియు పురుషులు కావలెను. ✆ 9494 119 269, 9542 550 896.

■ CC TV, సెక్యూరిటీ అలారమ్, Fire అలారమ్ సిస్టమ్స్‌గల ప్రముఖ కంపెనీకి ఫీల్డ్ సర్వీస్ టెక్నీషియన్స్ కావలెను. Qul: ITI / అనుభవం, జీతం: 12 to 20K PM. ✆ 93987 28839, 63007 40378.

■ చెదల నివారణ సంస్థలో పనిచేయుటకు సర్వీస్ బాయ్స్ కావలెను. వెహికల్ తప్పనిసరి. అర్హత: 10th, జీతం: రూ. 17,000/- టైమింగ్స్: 8:00 am to 8.00 pm సంప్ర: ✆ 94945 69895

■ Multipurpose Health Asst. / PRO - (M)-1, Qul: 10th/Inter / Degree. Nurse (F)-1. Qul: ANM/GNM-Fresher, Sal.: Negotiable SLN Hospitals, VJA ✆ 9666947666, 0866-2470032

■ Wanted Female Counsellors, Telecallers, Receptionist, Hostel Wardens & Male Class Incharges & Hostel Warden. 91542 10069

■ ప్రముఖ కంపెనీకి మీ ఇంటివద్దనే ఉంటూ ఒక గంట పార్ట్‌టైం మాన్యువల్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. డైలీ పేమెంట్స్, డైలీ: 4000/-. వివరాలకు వాట్సప్/కాల్: 98856 82589

■ Wanted Male Incharges and Female Telecallers Qualification Any Inter/ Degree. Age Limit: 21 to 45 years, Salary Negotiable. Location: Vijayawada. Contact: 89781 80832

■ కష్టమైన్స్ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40 వేలు.ఫ్రీ రూం+భోజనం.HYD.7995984445

■ త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను, చంటి పిల్లలను, చూసుటకు వర్కర్స్/నర్సులు కావాలి. ఫ్రీ వసతి, ఫుడ్, జీ: 18K. Ph: 8520980099, 8520874499

■ శ్రీ శ్రావణి మ్యారేజ్ బ్యూరోలో జాబ్ చేయుటకు ఇంట్రెస్ట్ గల మ్యారేజ్ అయిన లేడీస్ వెంటనే సంప్రదించగలరు. బందరు రోడ్డు, పోరంకి, తాడిగడప సెంటరులో ✆ 9392124545.

■ ప్రముఖ కంపెనీ కొరకు డిగ్రీ చదివి మరియు Accounts తెలిసిన, వాక్చాతుర్యం కల్గిన female personal secretary కావలెను. ఆకర్షణీయమైన జీతం కలదు.✆ 9346075185.

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul:- టెన్త్ to డిగ్రీ, Sal:- 20k-30k మీ అడ్రస్ వాట్సాప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోమ్ అవకాశం కలదు. 8121818692

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారులు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించవలెను.